13న రైతు బీమా దరఖాస్తులకు ఆఖరు

శంషాబాద్ రూరల్: రైతు బీమా కోసం రైతులు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత తెలిపారు. కొత్త పట్టాదారు రైతులకు జూన్ 5 వరకు పట్టాపాసు పుస్తకాలు వచ్చిన వారు, ఇప్పటి వరకు రైతు బీమా చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారంలో వివరాలు పూర్తి చేసి పట్టా పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను సమర్పించాలన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన రైతులు మాత్రమే బీమాకు అర్హులని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, వైద్యులు

శంషాబాద్: పట్టణంలోని సాతంరాయిలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాల (బాయ్స్)లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అనూప్ చందు విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించి మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు, సూచనలు విద్యార్థులకు వివరించారు. ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ చూపాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షహనా నజ్నీన్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం: వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన మంచర్ల సిద్దులు

శంషాబాద్ రూరల్: బైక్‌ను డీసీఎం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... పోశెట్టిగూడకు చెందిన మంచర్ల సిద్దులు(48) శంషాబాద్ కూరగాయల మార్కెట్లో పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం బైక్‌పై గ్రామం నుంచి శంషాబాద్ వస్తున్నాడు. తొండుపల్లి చౌరస్తాలో బెంగళూరు జాతీయ రహదారిపై ఇతని బైక్‌ను వెనుక నుంచి వచ్చిన ఓ డీసీఎం వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దులుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సరుకుల అందజేత

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో 'ఈ' కంపెనీ వార్షిక కార్యక్రమంలో భాగంగా బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ రాంబాబు చీర్స్ ఫౌండేషన్ అనాథాశ్రమాన్ని శనివారం సందర్శించారు. సరుకులు, పండ్లు, బియ్యం, నూనె అందజేశారు. కార్యక్రమంలో కమాండర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఈ కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు

జియాగూడ: పౌర్ణమిని పురస్కరించుకుని కార్వాన్ దత్తాత్రేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, హోమం, మధ్యాహ్నం అఖండ హారతి, అనంతరం ఆకుల గోవర్ధన్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మదన్ జాదవ్, పడాల అనంత కృష్ణ, దేవర శ్రీనివాస్, పీ శ్రీనివాస్, ఏ సాయి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బీ రామ్, ఉపాధ్యక్షులు వీ కందోజీ, కార్యదర్శి బీ చంద్రకాంత్, సహాయ కార్యదర్శి జే అనిల్, కోశాధికారి బీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సూచించారు. టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం

సంతోష్‌నగర్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే సత్యనారాయణకు సీపీ సి.వి.ఆనంద్ శనివారం మెమోంటో, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఎస్సైలు, సిబ్బంది ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

అంబరాన్నంటిన రాఖీ సంబురం


బండ్లగూడ జాగీర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పండుగలో అన్నాచెల్లెలు


గంగిడి సాయిక్‌రెడ్డి, రిత్విక్‌రెడ్డిలకు రాఖీ కడుతున్న అక్క శృతి


అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావుకు రాఖీ కడుతున్న మహిళా పోలీసులు


అన్న శ్రీకాంత్‌కు రాఖీ కడుతున్న చెల్లి వర్షితరెడ్డి


గగన్‌పహాడ్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

అత్తాపూర్: రాఖీ పర్వదిన సంబురాలు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా రాఖీ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం నియోజకవర్గం పరిధిలోని పలు నేతల ఇళ్ల వద్ద మహిళా నేతలు, కార్యకర్తల సందడి కనిపించింది. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో...

రాఖీ పౌర్ణమి సందర్భంగా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో వేడుకలు జరిగాయి. ఉదయం స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్స్ తమ సోదరులుగా భావించి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావుకు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమం పట్ల ఇన్‌స్పెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. రాఖీ కట్టిన మహిళా పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలన్నారు. మహిళా పోలీసులు చూపిస్తున్న ఈ ప్రేమ, గౌరవం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అందరం కలిసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిద్దామన్నారు.


మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్‌కు రాఖీ కట్టిన మాజీ మంత్రి సబితారెడ్డి


మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో

మణికొండ: సోదరీ, సోదరుల అనుబంధానికి ప్రతీకగా జరుపుకొనే రక్షాబంధన్ శనివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఘనంగా జరుపుకొన్నారు. సోదరుల వద్దకు సోదరీలు వచ్చి రాఖీలు కట్టి వారిని ఆశీర్వదించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్‌తో పాటు స్వయం సేవకులు పాల్గొన్నారు. గండిపేటలోని సీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులుతో పాటు అధ్యాపకులకు, మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌కు కె.నరేందర్‌రెడ్డికి బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌కు ఆయన సోదరీమణులతో పాటు గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కట్టి ఆశీర్వదించారు.


రాజేంద్రనగర్‌లో...


సీబీఐటీలో బ్రహ్మకుమారీలు


ఖానాపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో...


మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డికి రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు


కాంగ్రెస్ నార్సింగి అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌కు రాఖీలు కట్టిన మహిళలు

సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి


మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో ఈ నెల 19వ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహాసభల్లో ప్రజా సమస్యలు, రాజకీయ సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యాచరణలను రూపొందించనున్నట్లు వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రియాజ్, కౌన్సిల్ సభ్యుడు జె.ఆనంద్‌గౌడ్, మండల సహాయ కార్యదర్శులు జె.విజయానంద్ గౌడ్, ఎం.డి.షఫీ, ఎర్రబోడు, కార్యదర్శి పాండు, లక్ష్మీగూడ కార్యదర్శి జె.సదానంద గౌడ్, ఆసీఫ్ కార్యదర్శి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మహా ముని ర్యాలీ

చార్మినార్: మార్కేండయ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో పాతబస్తీ దూద్‌బౌలిలోని సిప్లిగంజ్‌లో 93వ మార్కేండయ మహా ముని శివ లింగ సామూహిక ఊరేగింపును శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ పర్వదినం రోజే దారం పుట్టిందని నమ్మిన పద్మశాలీలు ఏటా తమ సోదరులకు దారంతో రాఖీలు కట్టి రక్షణగా ఉండాలని కోరుతారన్నారు. అందుకే ఈ రోజు దారానికి పూజలు నిర్వహిస్తారన్నారు. గడ్డె శంకర్, పులిపాటి ప్రభాకర్, దుర్గేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో తిరుపతి శ్రీనివాస్ రావు, భాను చందర్ యాదవ్, భారత, మధు, శేఖర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

మియాపూర్: ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద సేవా సంఘం వృద్ధాశ్రమంలో రామస్వామి ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి చందానగర్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు భార్గవ్, అబ్రహం లింకన్, డాక్టర్ షమీర్‌లతో పాటు సిబ్బంది రక్త పోటు, షుగర్, పల్స్, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. అదేవిధంగా ఆరోగ్యం విషయంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. 90 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివ రామకృష్ణ, విష్ణు ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు సుందర ప్రసాద్, సమాజ సేవకులు వెంకట్, ఆసుపత్రి ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు


శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు మల్లన్న ప్రాంతానికి చెందిన స్థానికులు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, రోడ్డు విస్తరణ జరగకపోవడంతో పాటు సరైన రోడ్లు లేవని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ... తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, పద్మనాథ్, సాయిరెడ్డి, కిట్టు, నరేష్, రాజేష్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని పాటించాలి

చందానగర్: శ్రీ లక్ష్మీ గణపతి బ్రాహ్మణ సంఘం చందానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఉపాకర్మ కార్యక్రమంను శనివారం సాయి కీర్తి ఎస్టేట్స్ కమ్యూనిటి హాల్‌లో నిర్వహించారు. పది మందికి ఉపనయనంలో భాగంగా యజ్ఞోపవీతధారణను జరిపించారు. వేద పండితులు, ఘనాపాటి హరి సీతారామమూర్తి శాస్త్రబద్ధంగా పూర్తి చేయించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వేద విజ్ఞానాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాలకు అందించేందుకు అందురూ కృషి చేయాలని, స్వీయ నియమ నిబంధనలను తప్పకుండా ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్యామలరావు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి శశి భూషణ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: కళాకారులు నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కృతి నృత్య అకాడమీ డాక్టర్ రోజని వల్లభనేని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో వినాయకకౌతం, పుష్పాంజలి, చంద్రచూడ, చరణములే నమ్మితి, ఆత్మరామ, బృందావసానం, కళ్యాణరామ, శివతాండవం, రామాయణశబ్దం, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను కళాకారులు కంతి, అను, వేదం, అక్షద, రజ్వీ, సుకన్య, ఆద్య, రితిక, మహశ్రీ, ప్రదర్శించారు. అలాగే శ్రీరామ నాటక నికేతన్ గురువు మంజుల రామస్వామి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. వసుధైక కుటుంబం, శివస్తోత్రం, నటనమాడినారు, గోపిక మాధవం తదితర అంశాలను కళాకారులు వరేణ్య, స్మితిక, వర్ధిక, సాన్విత, అనుష్క, ఆకృతి, వర్ష, రెబెక్క, వంశిక, శరణ్య, సహస్ర, సంధ్య, తనుశ్రీ తదితరులు ప్రదర్శించారు.



అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం స్వరాలాపన నిర్వహించారు. శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ సంస్థ గురువు ఊటుకూరి శ్రీనివాస్ శిష్య బృందం అంతయునీవే, అన్ని మంత్రములు, షోడశకళానిధికి, ఎక్కడి మనుషజన్మము, వచ్చెను అలమేలు మంగ, కంటి శుక్రవారము, కీర్తనలను సృజన, కవిత, రామలక్ష్మి, ప్రసన్న, మహిమ, కావ్య, నివేదిత, వైష్ణవిలు ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్‌లు కళాకారులను ఘనంగా సత్కరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

చందానగర్: చాతుర్మాస్య దీక్షలో భాగంగా చందానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి కల్యాణం నిర్వహించారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వారు అధ్యక్షతన ప్రధాన అర్చకులు సాయి నేతృత్వంలో ప్రత్యేక పూజలు, కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నవితరణ చేశారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

గోల్కొండ: పరిసరాల శుభ్రతతో రోగాలు దరిచేరవని బల్దియా మలేరియా విభాగం అధికారి మహ్మద్ ఇంతియాజుద్దీన్ అన్నారు. గోల్కొండ నయాకీలాలోని ఉర్దూ మోడల్ స్కూల్‌లో దోమల నిర్మూలన, దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్లార్‌తో పాటు నీళ్ల ట్యాంకుల్లో వృథా కూలర్లు, నీటి బ్యారెల్స్‌లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఇంట్లోని పాత సామాన్లు, వాడేసిన టైర్లు, ట్యూబ్‌లు ఉంచకూడదన్నారు. అలాగే బడిని, బడి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మలేరియా సిబ్బంది రాజ్‌కుమార్, నర్సింహులు ఉన్నారు.

ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యం

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఏఐసీసీ ప్రతినిధి విశ్వనాథ్ ధీమా వ్యక్తం చేశారు. షేక్‌పేట్‌లో కాంగ్రెస్ బూత్ ఇన్‌చార్జిలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గతంలో కంటే ఈసారి ఓటు బ్యాంకు గణనీయమంగా పెరిగిందని అభ్యర్థి ఎవరైనా సరే గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.